# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 31 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL


## నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా నిర్వహించుకోవాలి

● ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం ● నేడు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు

ఎదులాపురం, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 30 ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇతరులకు ఇబ్బంది కలగనీయకుండా వేడుకలు నిర్వహించుకోవాలని, రాత్రి 12.30 గంటల వరకు ముగించాలని సూచించారు. డీజేలు, అధికంగా శబ్దం చేసి సౌండ్ సిస్టంలు వినియోగించవద్దని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం తాగి వాహనాలు నడపడం, నిషేధిత డ్రగ్స్, గంజాయి తీసుకోవడం, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా ఇబ్బందులకు గురైతే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.



సీఆర్టీలతో కలిసి నిరసన చేపడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న, జడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్

## సీఆర్టీలకు ఇచ్చిన మాట ఏమైంది ?

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఉట్నూర్, డిసెంబర్ 30 : అధికారంలోకి రాగానే సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఏమైందని బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న, జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రశ్నించారు. సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు రిలేదీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన వాగ్దానాలు విస్మరించడం కాంగ్రెస్ పార్టీ నాయకులకే చెల్లిందన్నారు. సీఆర్టీలవి న్యాయమైన డిమాండ్లు అన్నారు. వీరి దీక్షతో పాఠశాలలు నడవడం లేదని దీంతో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావు, నాయకులు ధరణీ రాజేశ్, సలీం, కేంద్రే రమేశ్, వెంకటేశ్, మహేందర్, బాబా శ్యాం, సోనేరావు, సత్తన్న, దినేశ్, శ్రీకాంత్, రాందాస్, సాజీద్, సాయికుమార్, ఖాసీంలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశం**

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్,30: ప్రజావాణికి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇప్పటివరకు వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, సీఎం ప్రజావాణి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులు పరిష్కరించినపుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 100% హ్యాట్రిక్ సాధించేనా..?

**'పది'ఫలితాల్లో రెండేళ్లుగా నంబర్ వన్‌గా నిర్మల్ జిల్లా**

● ఈ ఏడాదీ ముందంజలో నిలిచేనా? ● టీచర్ల సర్దుబాటు లేక తరగతులకు నోచుకోని విద్యార్థులు ● నిర్మల్ జిల్లాలో చాలా చోట్ల టీచర్లు లేక ఇబ్బందులు ● ఎస్సెస్సీ ఫలితాలపై తీవ్రప్రభావం

నిర్మల్, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): పదో తరగతి ఫలితాల్లో రెండేళ్లుగా వరుసగా 100 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉన్న నిర్మల్ జిల్లా..ఈ ఏడాది టీచర్ల కొరతతో హ్యాట్రిక్ సాధించడంపై సందేహం నెలకొన్నది. విద్యా సంవత్సరం ముగిసేందుకు వస్తున్నా జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక, సరైన బోధన అందక పదో తరగతి విద్యార్థులు చదువులో వెనుకబడే పరిస్థితి నెలకొన్నది. అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లను, ఉన్నత పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులే తాత్సారం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయుల ఖాళీలతో పదవ తరగతి విద్యార్థుల ఫలితాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై ఏడు నెలలైంది. మరో రెండున్నర నెలల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వచ్చే మార్చి 21 నుంచి పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటికే షెడ్యూల్ కూడా జారీ అయింది. ఇప్పటికే జిల్లాలో చా లా ప్రభుత్వ పాఠశాలల్లో కీలక సబ్జెక్టులైన గణితం, భౌతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల్లో ఆం దోళన నెలకొన్నది. రెండు నెలల నుంచి పదవ తరగతి విద్యార్థుల కోసం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు పూటలు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకు కూడా ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నది. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల సర్దుబాటు ప్రక్రియను సరైన సమయంలో చేయకుండా జిల్లా విద్యాశాఖాధికారి కాలయాపన చేస్తుండడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఒకవేళ టీచర్లను సర్దుబాటు చేసినా ఈ రెండు నెలల్లో సెలబస్ పూర్తి చేయడం కష్టమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన డీఈవో బదిలీ కావడంతో రెండు నెలల క్రితం కొత్త డీఈవో విధుల్లో చేరారు. అయితే ప్రస్తుత విద్యాశాఖాధికారి టీచర్ల సర్దుబాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో 10వ తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపనున్నది.

### ఉత్తీర్ణత శాతం తగ్గే అవకాశం..



జిల్లాలో సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేయకపోవడంతో బోధన అందక పదవ తరగతి విద్యార్థులు నష్టపోతారు. పది ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పడిపోయే అవకాశం ఉన్నది. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లాం. అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి వినతి పత్రాలను ఇచ్చాం. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానాలతో పాటు, ఖాళీలుగా ఉన్న పాఠశాలల్లో అదే మండలంతో పాటు, సమీప మండలాల్లోని స్కూళ్లలో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లతో సర్దుబాటు చేయాలని కోరాం. అయినా డీఈవో ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లాలో చాలా చోట్ల విద్యార్థుల సంఖ్య కన్నా ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా వెంటనే టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలి. *-టీ.నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్*



టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలని డీఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు (ఫైల్)

### ఉపాధ్యాయ సంఘాలు విన్నవించినా...

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేసి విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చూడాలని దాదాపు అన్ని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు డీఈవోకు మొరపెట్టుకున్నారు. అయినా నిర్లక్ష్యం వహించారన్న విమర్శలు ఉన్నాయి. అర్హులైన ఎస్జీటీలను ఆయా మండలాల పరిధిలో సర్దుబాటు చేసే అధికారం డీఈవోకు ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. ఒకవైపు సబ్జెక్టు టీచర్ల కొరత, మరోవైపు ప్రతి నెలా కొంతమంది టీచర్ల ఉద్యోగ విరమణ, ఇంకోవైపు కస్తూర్బా పాఠశాలల టీచర్లు 18 రోజులుగా సమ్మె చేస్తుండడం విద్యార్థులకు శాపంగా మారింది. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను సబ్జెక్టు టీచర్లతో సర్దుబాటు చేసి విద్యార్థులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత డీఈవోపై ఉన్నదని నాయకులు కోరారు

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్,30 : మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ పది రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టర్ బయటకు రావాలని వినతి పత్రం తీసుకోవాలని నినాదాలు చేశారు. అధికారులు బయటకు రాకపోవడంతో కార్మికులు కార్యాలయంలోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్మికులు ద్వారం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఆరు నెలల నుంచి పెండింగ్ వేతనాలు, ఐదు నెలల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్ బయటకు వచ్చి కార్మికుల సమస్యలు విని వినతిపత్రం తీసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మన సురేశ్, మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భారత్‌భాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధ, ఉపాధ్యక్షుడు లక్ష్మి, గంగాధర్, సహాయ కార్యదర్శి విజయ, శంకరమ్మ, సత్తవ్వ, ఎస్‌కే భాను, రాజమణి, మంగ, పద్మ, లింగవ్వ, మంజుల, రాంబాయి, తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

# వినతుల వెల్లువ

● ప్రజావాణికి 108 అర్జీలు ● త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం

ఆదిలాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై అర్జీలు వెల్లువలా వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి దరఖాస్తులు సమర్పించారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షాను కోరారు. ప్రధానంగా పంట రుణమాఫీ, భూ సమస్యలు, పింఛన్లు, పీఎం కిసాన్ సమ్మాన్ యోజనతో పాటు ఇతర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వివిధ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 108 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయం అధికారులు తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

### రుణమాఫీ కాలేదు



*కేసీఆర్ ప్రభుత్వం నాకు దళితబస్తీ కింద 3 ఎకరాల భూమి ఇచ్చింది. నేను జైనథ్‌లోని దక్కన్ గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.2 లక్షల రుణమాఫీ కింద నా బ్యాంక్ లోన్ మాఫీ కాలేదు. మాఫీ ఎందుకు జరగలేదని బ్యాంకు అధికారులను అడిగితే మాకు ఏమీ తెలియదని అంటున్నారు. మండలంలో వ్యవసాయ అధికారులకు దరఖాస్తు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో కలెక్టర్‌కు విన్నవించిన.* **- గంగమ్మ, రైతు, లక్ష్మీపూర్, జైనథ్ మండలం**

### మూడు నెలల నుంచి తిరుగుతున్న..



*నాకు మూడు ఎకరాల భూమి ఉంది. నేను ఎస్‌బీఐ, సీసీఐ బ్రాంచ్‌లో 2022, డిసెంబర్‌లో రూ.1.50 లక్షల క్రాప్ లోన్ తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తుందని నా బ్యాంక్‌లోన్ రద్దవుతుందని అనుకున్న. కానీ నిరాశే మిగిలింది. ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు విడుతలుగా రుణమాఫీ ప్రకటించినా నా లోన్ మాత్రం మాఫీ కాలేదు. వ్యవసాయశాఖ, రెవెన్యూ, బ్యాంకు అధికారుల చుట్టూ మూడు నెలలుగా తిరుగుతున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ సారు స్పందించి రుణమాఫీ చేయాలి.* **- రమేశ్, రైతు, చాంద (టీ), ఆదిలాబాద్ రూరల్ మండలం**

### పీఎం కిసాన్ పైసలు రావడం లేదు..

*జైనథ్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన 18 మంది మహిళా రైతులకు మాకు కేసీఆర్ ప్రభుత్వం దళితబస్తీ కింద ఒక్కొక్కరికీ మూడు ఎకరాలు భూమి పంపిణీ చేసింది. నాలుగేళ్ల నుంచి తమకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ యోజన డబ్బులు రావడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే మాకు తెలియదని అంటున్నారు. పీఎం కిసాన్ డబ్బులు అంచాలని కలెక్టర్ వినతిపత్రం ఇచ్చినం.* **-లక్ష్మీపూర్ మహిళా రైతులు**



## అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

**-వామపక్షాల డిమాండ్**

ఎదులాపురం,డిసెంబర్ 30: పార్లమెంట్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను టీడీపీ ఖండించకపోవడం శోచనీయమని, అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షాకు వ్యతిరేకంగా సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకుడు దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను నిండు పార్లమెంట్లో అవహేళనచ చేస్తూ అమిత్ షా మాట్లాడారన్నారు. ఆయన మాటలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బలపరచడం సరికాదన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు లంకరాఘవులు, కిరణ్, ఆశన్న, సచిన్, కృష్ణ స్వామి, చిల్క దేవిదాస్, మేస్రం భాస్కర్, సురేశ్, గణేశ్, వెంకటనారాయణ, జగన్ సింగ్, లంక జమున ఉన్నారు.



అంబేద్కర్‌చౌక్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షపార్టీల నాయకులు

## కళ్లకు గంతలు కట్టి..



ఆదిలాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

*సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆదిలాబాద్‌లోని తెలంగాణచౌక్ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కలెక్టరేట్‌ఎదుట చేపడుతున్న సమ్మె సోమవారానికి 21వ రోజుకు చేరుకున్నది. వీరికి ఆదిలాబాద్ ఎంపీ జీ నగేశ్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్ఎస్‌ఏ ఉద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి మొండి వైఖరి సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి విస్మరించడం తగదన్నారు. వీరి సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించాలన్నారు. రెండు రోజుల్లో ఉద్యోగుల సమస్యలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. దీక్ష శిబిరాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మధనం గంగాధర్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు ప్రియాంక పార్థ సారథి ధర్మ సింగ్ సురేందర్ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.*

*- ఎదులాపురం, డిసెంబర్ 30*

## యజ్ఞం చేసి..నిరసన తెలిపి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 30 : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా సోమవారం యజ్ఞం చేసి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తిరుపతి, నవిత, వీణ, అపర్ణ, పుష్పలత, రాధిక, శ్రీలత, గంగామణి, ప్రభ, సునీత తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో యజ్ఞం చేసి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు